కథ

# బుసీఫెలస్! నువ్వు అనాథవు కావు!

డా॥ వి.ఆర్.రాసాని

రంజాన్ చివరి పది రోజుల్లో 'ఇతికాఫ్'లో వున్న మహబూబ్‌బాషా మజీద్‌లో ఓ మూల కూర్చొని ఇతికాఫ్ నియత్ః "వ అలైహి తవక్కల్తు, వనటైతు, సున్నతుల్ ఇతికాఫ్" అని స్మరించుకుంటున్నాడు. అది నమాజ్ చదువుకునే సమయం. ఆ నమాజ్ అయిపోగానే ప్రధాన మందిరం ముందుకు వచ్చి, తల పైకెత్తి ఒక్కసారి ఆకాశంలోకి చూశాడతను. మెరుస్తున్న నక్షత్రాలతో విశాలమైన నీలిరంగు ముఖమల్ బట్టలా కనిపిస్తోందాకాశం... అందులో పండుగరోజు పూచిన చమన్‌లా అనిపించాడు చంద్రుడు. ఎక్కడ చూసినా రంజాన్ వాసనే. అవేవీ ఆతని మనసుకు ఆనందం కలిగించడం లేదు. ఆతని మనసునిండా బుసీఫెలస్సే. "ఓ బుసీఫెలస్... ఎలా వున్నావో కదా!" అని ఒక నిట్టూర్పు విడిచి, ఆ ప్రక్కగా వున్న సమాధుల వైపు నడిచాడు.

ఒకరోజు ఇతికాఫ్ వ్రతం పాటించి అప్పుడే అక్కడికి వచ్చిన కరీ ముల్లా "క్యా మామూ! ఇతికాఫ్‌లో వున్నావా?" అడిగాడు.

"హాc...బేటా! నువ్వూ అందుకే వచ్చావా?"తిరిగి అడిగాడు బాషా.

"నా బేటీ కువైట్‌లో వుంది కదా. ఆ బేటీ సుఖంగా వుండాలని ఒక రోజంతా ఇక్కడే వుండాగదా ఇంక అసర్ నమాజ్ చేసుకొని వెళ్ళిపోతా!" అని ఇంకొంచెం దగ్గరగా వచ్చి "నువ్వెప్పట్నుంచీ వున్నావ్" అంటూ అడిగాడు.

"నేను తొమ్మిది రోజుల నుంచీ వుండా" అన్నాడు బాషా.

"మామాజీ! బిడ్డలు నిన్ను వదిలేసినా, నువ్వు మాత్రం వాళ్ళకోసం ఇతికాఫ్ పాటిస్తున్నావు?"ఏమైనా బిడ్డలపైన బెమత పోలేదు మామూ నీకు" అన్నాడు కరీం.

"వాళ్ళకోసరం నహీ బేటా. వాళ్ళ దగ్గరున్న నా బుసీ కోసం ఈ దీక్షలో వున్నా. నా పెద్దకొడుకు మాదిరి దాన్ని చూసుకున్నా. దానికి నేను తోడు. నాకు అది తోడు. అయినా మేరా బేటా ఆ తోడు కూడా లేకుండా చేసినాడు గదా!" బాధగా అన్నాడు బాషా.

ఒక నిట్టూర్పు విడిచి "సరే లోపలికి పోయొస్తా" అంటూ మసీదు లోపలికి దారి తీశాడు కరీం.

బుసీ గుర్తుకొచ్చేసరికి ఆతని మనసు... ఆ ఆవరణలోనే పక్కగా వున్న రావిచెట్టులో కదలాడుతున్న పచ్చటి జండా గుడ్డలా రెపరెపలాడిపోయింది. "బేటా! బుసీ! ఓ నా ప్రియమైన బుసీఫెలస్! ఎలా వున్నావో? అసలు నీకెలా వుందో? అది తెలసకరమ్మనే ఖాదర్‌వలీని పంపినా. వాడింకా రాలా!" ఒక నిట్టూర్పు విడిచాడు బాషా.

"అల్లానుంచీ మహమ్మద్ సొల్లె అలాహోవ సొల్లెంకు దివ్యఖురాన్ అందిన ఈ పవిత్ర మాసంలో మానవుడు నమాజు, కలిమా, ఉపవాస దీక్ష, ఫిత్ర, హాజ్‌లలో చివరిది తప్ప మిగిలిన నాలుగు ధర్మాలు ఆచరిస్తాడు. ఆ సమయంలో ఏది కోరుకుంటే అది జరిగి తీరుతుందంటారు. పహిలా అష్రా అయిన రహమ్మత్, తనను తాను సంస్కరించుకునే మగఫిరత్ అయిపోయింది. ఇప్పుడు ఇతికాఫ్ వ్రతంలో చివరి దశలో వున్నాను. ఎందుకోసం? కేవలం నా బుసీఫెలస్ కోసమే. బుసీ ఎలా వుందో?" తీవ్రంగా ఆలోచించసాగాడు బాషా.

అలా ఆలోచనల్లో పడిపోయినప్పుడంతా ఆతనికి బుసీఫెలస్ గుర్తుకొస్తుంది. అది గుర్తుకొచ్చిందా... ఆతని మనో అవనికపైన ఒక దృశ్యం మెరుపులా అవతరిస్తుంది. అది చాలా రోజుల తర్వాత మళ్ళీ ప్రత్యక్షమైంది.

"ఒక తెల్లటి గుర్రం...భయంకరమైన చూపుల్తో, రిక్కించిన చెవులు, వాటి మధ్య నుంచీ ముఖంపైకి కుచ్చులా వచ్చి పడుతున్న బొచ్చుతో, బుసలు కొడుతూ, సర్వాలంకృతమై ముందరి కాళ్ళు పైకెత్తి, కీకీకీ అని సకలించే గుర్రం... దానిపైన తళతళలాడే పొడువాటి కత్తి చేత బట్టుకొని ఉరిమిచూస్తూ ఓ బలిష్టుడైన యుద్ధవీరుడు... దాన్ని చూసి అయ్యో 'బూసి... బూసి' అంటూ భయపడి పరిగెత్తే జనం... బూసి పేరు వినగానే పాలు తాగే పసిపాపలు సైతం పాలు తాగడం ఆపేసి కెవ్వున కేకలు వేసే దృశ్యం!"

ఆతని మనో వీధినుంచీ ఆ దృశ్యం తొలగిపోగానే "అయ్యో! బుసీఫెలస్! కైసా హైరే తు! ఈ వలీగాడు యింకా రాలేదే! క్యా కర్‌నా మై" మనసులోనే మథనపడసాగాడు బాషా.

"మామూ! యేందో యోచన జేస్తా కూసున్నావే? నమాజ్ అయిపోయింది కదా! యింటికొస్తావా? యిక్కడే వుంటావా?" అసర్ నమాజ్ పూర్తి చేసుకుని తిరిగి వచ్చి అడిగాడు కరీం.

"నేను నిదానంగా వస్తాన్లే తుc జావ్!" అంటూ అక్కడే కూర్చున్నాడు బాషా. అక్కడ ప్రతి ఒక్కరూ స్నానాలు చేసి తొడుక్కున్న తెల్ల బట్టల్తో, నెత్తిన తెల్లటి టోపీలతో పరిశుభ్రంగా, మౌనంగా తిరుగాడుతున్నారు. అంతా చాలా పరిశుభ్రంగా ప్రశాంతంగా... ఆ వేళ ఆ మజీదు ఒక నూతన ఋషివాటికలా అనిపిస్తోంది... అయినా అసర్ నమాజుకు వచ్చే జనంతో అక్కడ చాలా సందడిగా వుంది. కొందరు ఒకర్నొకరు హత్తుకొని ఈద్ ముబారక్‌లు చెప్పుకుంటున్నారు.

అక్కడి అగరొత్తుల వాసనని, గంధపు సువాసనల్ని తనలో విలీనం చేసుకొని, పిట్టగోడలపై నుంచీ వీస్తున్న సన్నగాలి మత్తెక్కిస్తోంది. ఆ వాతావరణానికి అక్కడే వుండిపోదామనిపిస్తోంది భాషాకి. కానీ బుసీఫెలస్ జ్ఞాపకాలు అతన్ని స్థిమితంగా కూర్చోనివ్వడం లేదు. పైగా ఈ పది రోజులూ మసీదులోనే వున్నాడు. అక్కడే తినడం, అక్కడే పడుకోవడం.

"వ అలైహి తవల్తు..." మనసులో చదువుకుంటూనే పైకి లేచాడు. మౌనంగా యింటికి బయలుదేరాడు.

మహబూబ్ బాషాది అరవై పైబడిన వయసు. ముస్లిం సంప్రదాయం ప్రకారం పెంచుకున్న చిన్న బవిరిగడ్డం నెరిసిపోయి తెల్లగా కనిపిస్తోంది. నెత్తిన చర్మానికి అతుక్కుపోయినట్లు కనిపిస్తున్న టోపీ, చీకటిని చూసీ చూసీ నల్లబడిన బక్క శరీరం... అయిదడుగులా రెండంగుళాల ఎత్తుతో... రివటలా కనిపిస్తున్నాడు. అతను నడుస్తున్నాడే



గానీ అతని ఆలోచనలు అతన్ని వదలడం లేదు.

***

ఎప్పుడో తను పుట్టకముందు తన తండ్రి పీరూ సాహెబ్ మదనపల్లె దగ్గరున్న కురబలకోట నుంచీ చంద్రగిరి ప్రాంతానికి వలస వచ్చాడు. పీరూసాహాబ్ గుర్రపుస్వారీ తెలిసిన మనిషి. అతని జీవనాధారం గుర్రబ్బండే. చంద్రగిరి సమీపంలో వున్న తురకపల్లిలో నివాసం. అతనికి ముగ్గురాడపిల్లల తర్వాత ఉడుబోతు పిందెలా పుట్టాడతను. చిన్నప్పుడు చాలా బలహీనంగా వుండేవాడనీ, ఎన్నో మందులు, టానిక్‌లు వాడి పెద్దవాణ్ణి చేశామనీ తన తల్లి బతికున్నన్ని రోజులూ చెబుతూ వుండేది. అప్పట్లో పడమటి ప్రాంతం నుంచి వచ్చే భక్తులు చంద్రగిరి, మంగాపురంలలో దిగి శ్రీవారిమెట్టు దారిన తిరుమలకు చేరుకునేవారు. వాళ్ళను మెట్టువరకు గుర్రబ్బండిలో తీసుకునివెళ్ళి, వారిచ్చే డబ్బుల్తో సంసారం నెట్టుకొచ్చేవాడు పీరూసాహెబ్. ఆ బండిపైన వచ్చే వరుంబడితోనే చంద్రగిరి కోటవెనుకనున్న నరసింగాపురం దగ్గర పది గుంటల భూమి కూడా సంపాదించాడు. స్వర్ణముఖి నీళ్ళతో ఆ మడిలో బంగారం పండేది. ఎలాగో ఓలాగు ఆడపిల్లలందరికీ పెండ్లిండ్లు కూడా చేసేశాడు పీరూసాహెబ్. ఆ చంద్రగిరి స్కూల్లోనే తను ఏడు వరకు చదువుకున్నాడు. తను బడికి వెళ్ళే రోజుల్లోనే గుర్రబ్బండి తోలడం, గుర్రంపైన స్వారీ చేయడం... అన్నీ తెలుసుకున్నాడు. గుర్రానికొచ్చే వ్యాధులు, వాటికి మందులు, గుర్రాన్ని ఎక్కడ గిచ్చితే ఎలా స్పందిస్తుందో, ఎక్కడ చక్కిలిగింతలు పెడితే పరిగెడుతుందో అన్నీ క్షుణ్ణంగా తెలుసుకున్నాడు. అతను జీనిపైన కూర్చొని కళ్ళెం చేతబట్టుకొని రికాబుల్లో పెట్టిన కాళ్ళపైన నిలబడి నడుం పైకెత్తి వంగి స్వారీ చేశాడంటే గుర్రం తూనీగలా, తారాజువ్వలా ముందుకు దూసుకుపోవాల్సిందే. ఆతను గుర్రంపైన కూర్చుంటే ఒక రాజకుమారుడే అనిపించేది తన తండ్రికి. కొడుకు ప్రయోజకత్వం చూసి పీరూ సాహెబ్ చాలా సంతోషించేవాడు. తనకు వయసు మీద బడడంతో కొడుకుకు గుర్రబ్బండి అప్పగించి తాను విశ్రాంతి తీసుకున్నాడు పీరూసాహెబ్. తనకు మీసకట్టు ఏర్పడగానే కురబలకోట నుంచీ తన పాత బంధుత్వంలోనే ఒక అమ్మాయిని చూసి నిఖా కూడా చేశాడు. తన చేతికి గుర్రం వచ్చిన తర్వాత ఉలవ గుగ్గిళ్ళు, గోధుమరవ్వ, పచ్చగడ్డి, గరికపోచలు, అవి దొరకనప్పుడు సద్దచొప్ప, వరిగడ్డి వేసి బాగా మేపాడు బాషా. అది గోధుమరంగు సమున్ జాతి గుర్రం. త్వరగా అలసిపోయేది కాదు. కాకపోతే ఎప్పుడైన కాళ్ళనొప్పులు వచ్చేటివి. అప్పుడు కాళ్ళకు వేపాకు చుట్టివేసి గుడ్డ చుట్టి దారంతో గట్టిగా బిగించి తెల్లారి విప్పేస్తే దాంతో కాళ్ళనొప్పులు తగ్గేవి. అలా దాన్ని బిడ్డలాగే చూసుకునేవాడు. తన తండ్రి దానికి 'పంచకళ్యాణి' అని పేరు కూడా పెట్టాడు. తన కుటుంబాన్ని పోషించే పంచకళ్యాణంటే బాషాకి పంచ ప్రాణాలే.

ఒకరోజు ఉదయాన అటకలో నుంచి గోధుమపొట్టు తీసి పంచకళ్యాణి ముందరేశాడు. ఊహుఁ... అది దాన్ని మూసి కూడా చూడలేదు. పైగా అదోరకంగా చూసి సకిలించింది. 'ఏమైంది దీనికి?' అనుకున్నాడు.

అది మూడు కాళ్ళపైన నిలబడే నిలువెత్తు గుర్రం. ఒకచోట స్థిమితంగా నిలబడక తకతకమని కదను తొక్కుతున్నట్లు కదులుతూ అదో మాదిరిగా సకిలిస్తూనే వుంది. బాషాకేమీ అర్థం కావడం లేదు.

"అబ్బాజాన్" అంటూ ఇంటి ముందర కూర్చొని వున్న తండ్రి దగ్గర కొచ్చి దాని పరిస్థితిని వివరించాడు.

"దానికిప్పుడు జత కావాల్రా" అన్నాడు పీరూ. అర్థంకాలేదు బాషాకి.

'అరే ముఠాలే! నీకు నిఖా చేశాను, అంతమాత్రం తెలీదా? దేకో! దానికీ జోడీ కావాలి. జోడీ... ఆఁ" అన్నాడు పీరూ.

"అయితే ఇప్పుడేం చేయాలబ్బా?"అయోమయంగా అడిగాడు బాషా.

'ఇది ఆడది... ఎదకొచ్చింది... మగ గుర్రం దగ్గర దాటించుకోని రావాల. నైతో మన మాట వినదు"

"మరి ఈ పక్కల యాడా మగ గుర్రం లేదే క్యా కర్‌నా?"

"డర్ నహీ బేటా! పీలేర్లో మీ కాకా నన్నేసాయిబుండాడు గదా ఆయన దెగ్గిరుండాది మంచి జాతయిన పంజాబ్ గుర్రం. దాని దగ్గర దాటించుకోని రావాల" చెప్పాడు పీరూ.


"ఆడికి గుర్రాన్ని ఎట్లతీసుకుపోవాల?"అనుమానం వ్యక్తంచేశాడు తను.

"నీకు సవారీ తరాహ్ వచ్చు కదా! గుర్రాన్నేసకపో... ఆ పంచకళ్యాణి బాధ చూడలేకుండా వుండాను బేటా! గద్దీమాదిరి అరస్తా వుండాది. జల్దీ జాఁవ్..." అన్నాడు పీరూ.

ఆ మాటతో బాషా కడుపునిండా అన్నం తిని, బట్టలు మార్చుకొని ఇంట్లో ఓ మూల వున్న జీని, రికాబులు తెచ్చి గుర్రం వీపుకు అమర్చాడు. అలాగే కళ్ళెం కూడా వేశాడు... దాని జబ్బల్లో గిచ్చి, నరాలపైన కాస్తా చక్కిలిగింతలు పెట్టాడు. ఆ భాష దానికర్థం అయినట్టే వుంది. అటు ఇటు కదిలి తన సంసిద్ధతను తెలియజేసింది. తండ్రి దగ్గర శెలవు తీసుకుని, గుర్రాన్నెక్కి తారురోడ్లోకొచ్చాడు. ఇక అక్కడి నుంచీ దౌడు తీయించాడు బాషా. ఆ రోజు మధ్యాహ్నం వేళకి పీలేరు చేరుకున్నాడు.

ఆ రాత్రి సంజాబ్ గుర్రంతో దాటించుకొని, మరునాటి తెల్లవారే లేచి ఇంటికి చేరుకున్నాడు. దాని ఫలితంగా కొన్ని మాసాలకు ఒక తెల్లటి సంజాబ్ జాతి గుర్రం పిల్ల పుట్టింది. అది పుట్టింరోజు ఇంటిల్లిపాదీ పండుగ చేసుకున్నారు. అది మగది. దాన్నీ తమ యింట్లో ఒక సభ్యునిగానే భావించారు.

దాని కండ్లు పిల్లికండ్లు. దాని చూపు భయంకరమైంది. అందంగా



వున్నా చాలా రౌద్రంగా కనిపిస్తోంది. పిల్లలు దాని దగ్గరకి పోవాలంటేనే భయపడేవారు. దాన్ని చూసినప్పుడంతా ఆతనికి తను ఏడో క్లాసులో చదువుకున్న అలెగ్జాండర్ పాఠం గుర్తుకొచ్చేది. ఆ పాఠానికి వేసిన యుద్ధవీరున్ని మోసే గుర్రం బొమ్మ గుర్తుకొచ్చేది. అది గుర్తుకు రాగానే బుస్‌ఫెలస్ దృశ్యం ఆతని మనసులో మళ్ళీ ప్రత్యక్షమయ్యేది.

"పొడువాటి కత్తి చేతబట్టిన వీరుడు, ముందరికాళ్ళు పైకెత్తి సకిలించే గుర్రం... బూసి బూసి అంటూ పరిగెత్తే జనం. పాలు తాగడం ఆపి ఏడ్చే పిల్లలు..."

ఆ దృశ్యం మనోఫలకంపై నున్నంతవరకు అలెగ్జాండర్ స్థానంలో తనను, ఆతని గుర్రం స్థానంలో తన గుర్రాన్ని ఊహించుకునేవాడు బాషా. ఆ అలెగ్జాండర్ గుర్రం పేరు బుసీఫెలస్. బుసీఫెలస్ పొట్టి పేరు బుసీ. ఇప్పటికీ ఈ దేశంలో తల్లులు చిన్న పిల్లల్ని భయపెట్టడానికి 'బూసి వస్తావుండాదిరా బూసి" అంటూ చెప్పే బుసీఫెలస్. దానికి గుర్తుగా తన గుర్రానికి బాషా పెట్టుకున్న ముద్దుపేరు బుసీఫెలస్.

బుసీఫెలస్ పెద్దది కాసాగింది. దాంతోబాటు సంసారమూ పెద్దది కాసాగింది. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. తల్లిదండ్రులు కాలధర్మం చెందారు. కాలక్రమంలో శ్రీవారిమెట్టు గుండా తిరుమలకు వెళ్ళేవారు తగ్గిపోయారు. బాషాకి రాబడి తగ్గిపోయింది. దాంతో గుర్రబ్బండిని

తిరుపతి వీధుల్లో పరుగెత్తించాడు. పంచకల్యాణి పంచత్వం పొందింది. అతనికి బుసీఫెలస్సే ఆధారమైంది. కొద్ది రోజులు బాగానే జరిగింది. ఎగువన స్వర్ణముఖిపైన కళ్యాణి డ్యాం కట్టటంతో స్వర్ణముఖి ఎండిపోయింది. దిగువనున్న భూములు నీళ్ళు లేక ఎండిపోసాగాయి. బాషాకున్న పది గుంటల భూమిలోనూ పంటలు పండించడం కష్టమయిపోయింది. కళ్యాణీ నీళ్ళతో తిరుమల కొండపైకొచ్చే భక్తులకు దాహార్తి తీరిందిగానీ, స్వర్ణముఖి పరీవాహ ప్రాంతంలో మాత్రం నీటి కరవు శాశ్వితంగా మారిపోయింది.

అప్పట్లో... తిరుపతిలో మూడు చక్రాల టెంపోలు, రిక్షాలు వుండేవి. ఒకటి రెండు గుర్రబ్బండ్లుండేవి. నగరం పెరిగేకొద్దీ వాటి స్థానంలో ఆటోలు, టవును బస్సులు వచ్చి చేరి, వాటిదే రాజ్యమయింది. టెంపోలు, రిక్షాలు మూలపడ్డాయి. ప్రజలకు గుర్రబ్బండితో పని లేకుండా అయిపోయింది. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. తాను, బుసీఫెలస్ ఎంత కష్టపడినా తిండికి జరగడం కష్టమయిపోతోంది. ఈ క్రమంలో ఉన్న పది గుంటల మడిలో అయిదు గుంటలమ్మి కూతురి పెండ్లి చేశాడు. అల్లుడు కట్నం చాలడం లేదనీ, అల్లగారింటినించీ పెట్టిపోతలు లేవనీ పేచీ పెట్టి అత్తింటి గడప తొక్కడం మానేశాడు. భార్యకు అల్సర్ వ్యాధి. ఈ పరిస్థితుల్లోనే ఏ వయసుకాముచ్చట అని కురబలకోట నుంచీ ఒక చక్కటి అమ్మాయిని తెచ్చి కొడుకు సలీం బాషాకి పెండ్లి చేశాడు. అతనికి ఇద్దరు పిల్లలు కలిగారు. రానురాను కానా కష్టమయిపోయి, దారిద్ర్యం ఆ ఇంటిని చుట్టుముట్టింది. భార్యకు విపరీతంగా కడుపునొప్పి వస్తే తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చేర్పించాడు. డాక్టర్లు ఆమెను పరీక్ష చేసి వెంటనే ఆపరేషన్ చేయాలి. లేకుంటే క్యాన్సర్‌గా మారే అవకాశముందని అన్నారు. దాంతో వున్న అయిదు గుంటల మడీ అమ్మేసి భార్యకు ఆపరేషన్ చేయించాడు. అయినా ఫలితం దక్కలేదు. ఆపరేషన్ నుంచీ కోలుకోకనే భార్య చనిపోయింది. ఇక అప్పట్నుంచీ వట్టిపోయిన గొడ్డే అయ్యాడు బాషా. అయినా అధైర్యపడలేదు. 'నా బుసీఫెలస్ తోడుండేవరకు నాకేం భయంలేదు' అనుకున్నాడు. ముస్లిముల నిఖాల్లో, ఊరేగింపుల్లో గుర్రాన్ని అద్దెకిచ్చి సంసారాన్ని నెట్టుకురాసాగాడు. అయినా ఇంట్లోవాళ్ళకు సరైన తిండీ, బట్టా కూడా కష్టంగానే వుంది. ఏవైనా కూలిపనులు చేసి సంపాయిద్దామనుకుంటే ఏడేండ్లుగా ఒకటే కరవు. పంటలు పండక భూములు బీళ్ళుపడిపోయాయి. రైతుల పరిస్థితీ కష్టంగానేవుంది.

ఇదంతా గమనించిన సలీంబాషా అత్తగారు "మదనపల్లె దగ్గరున్న అంగళ్ళులో కసాయి అంగడి పెట్టిస్తాము. వచ్చెయ్. ఇక్కడే వుంటే పిల్లల్నే గాక మా బేటీని చంపేస్తావు" అని ఏదేదో నూరిపోసి పిల్లల్తో బాటుగా కోడల్ని, కొడుకునీ తీసుకెళ్ళిపోయారు. అత్తగారి ప్రాపకంలో చేరిపోయిన సలీంబాషాకి తండ్రి శత్రువైపోయాడు. ప్రస్తుతం గుర్రానికి తోడు తను, తనకు తోడు అదీ...తిరుపతిలో మేస్త్రీ పనులకు పోతూ తన పొట్ట నింపుకుంటూ గుర్రానికి అంత పెట్టగలుగుతున్నాడు. కానీ వయసు మీద పడసాగింది. కష్టంచేసే శక్తి నశిస్తోంది. గుర్రమూ ముసల్ది కాసాగింది. ఇలా రెండేండ్లు గడచిన తర్వాత కొడుకు పెట్టిన వ్యాపారం సరిగా జరగడం లేదని తెలిసింది. కురబలకోటలో దూదేకుల ముస్లిమ్‌లు ఎక్కువగా వుండడంతో పెండ్లిండ్లు ఎక్కువగా జరుగుతున్నాయనీ, పెళ్ళికొడుకుల ఊరేగింపులకు గుర్రం అవసరం ఎక్కువగా వుందనీ గ్రహించిన సలీంబాషా బుసీఫెలస్‌ని బలవంతంగా తీసుకెళ్ళిపోయాడు. అది ఇటీవల యింకా ముసిలిదైపోయిన కారణంగా నిఖా ఊరేగింపులకు పనికిరాకుండా అయిపోయింది. పైగా దాని వీపున ఏవో బరువులు వేసి మోయిస్తుంటే కింద పడిపోయి కాలు విరిగిందట. ఆ విషయం తెలిసినప్పటినుంచీ బాషా మనసు మనసులో లేదు. పోనీ పోయి చూద్దామంటే ఎప్పుడో తనను ఒక పనికిరాని వస్తువులాగా ఇక్కడే వదిలేసి వెళ్ళిపోయిన కొడుకు గడప తొక్కడానికి ఆత్మాభిమానం అడ్డొచ్చింది. దానికోసమే రంజాన్ చివరి పది రోజులూ ప్రపంచంతో ఏ సంబంధం లేకుండా మసీదులోనే ఒంటరిగా వుండి ఇతికాఫ్ పాటించాడు. దాని క్షేమ సమాచారాలు తెలుసుకురమ్మని అప్పు చేసి మరీ మనిషిని పంపించాడు. ఆతను పంపిన వలీ ఇంకా రాలేదు.

"నా బుసీఫెలస్‌కి ఎలా వుందో ఏమో?" అనుకున్నాడు.

ఈ ప్రశ్న ఇప్పటికి వంద సార్లయినా వేసుకుని వుండి వుంటాడు బాషా.

***

"ఇంతకీ కురబలకోటకు పోయిన ఆ ఖాదర్‌వలీగాడు ఏమైనాడో?"

ఇందిరమ్మ గృహ పథకానికి చిహ్నంగా ఇటుకరాళ్ళ గోడలు, మౌల్డింగ్ మాత్రమే పూర్తయి... చర్మం వలిచేసిన గొడ్డుదట్టెంలా కనిపిస్తున్న తన మూడంకణాల మిద్దింట్లో నుంచి బయటికొస్తూ అనుకున్నాడు బాషా.

ఆ రాత్రంతా వలీ కోసం ఎదురుచూసీ చూసీ ఆతని కళ్ళు కాయలు కాసినట్లయ్యాయి. తలుపులేని ఆ యింటి గుమ్మానికి తడికె అడ్డం పెట్టి వచ్చి, ఇంటి ముందరున్న అరుగుపైన కూర్చొని వీధివైపు చూడసాగాడు. ఆ వీధి చివరినుంచీ అటువైపుకు వస్తున్న నేస్తం కరీముల్లా తప్ప ఇంకే జనసంచారమూ లేదు. వీధి చాలా బిశాంబరంగా వుంది.

అదే ఆ ఊరికి చివరి యిల్లు... ఆ యింటికెదురుగా కొంత దూరంలో వున్న చింతచెట్టు... దానికింద చక్రాలు ముప్పాతిక భాగం అదృశ్యమై నేలలోకి దిగిపోయినట్లు పడివున్న గుర్రబ్బండి... ఆతని శరీరం లాగే సగం శిథిలమైపోయి కనిపిస్తోంది. దాన్నే చూస్తూ కూర్చున్నాడు బాషా.

"ఇది మా సంసారాన్ని లాగిన గాడీ. ఈ గాడీతోనే కదా మా అబ్బాజాన్ మమ్మల్ని సాకి సంతరించింది... బుసీఫెలస్ తర్వాత యిదొక్కటేనేమో నా గత కాలానికి సంబంధించిన చివరి జ్ఞాపకం. కొద్ది రోజులకు నా బుసీఫెలస్సూ మర్‌జాతా హైఁ... ఆ తర్వాత మైభీ మర్‌జాతా హైఁ... ఆ తర్వాత ఈ బండీ మట్టిలో కలిసిపోతుంది.

అప్పట్లో... తిరుపతిలో మూడు చక్రాల టెంపోలు, రిక్షాలు వుండేవి. ఒకటి రెండు గుర్రబ్బండ్లుండేవి. నగరం పెరిగేకొద్దీ వాటి స్థానంలో ఆటోలు, టవును బస్సులు వచ్చి చేరి, వాటిదే రాజ్యమయింది. టెంపోలు, రిక్షాలు మూలపడ్డాయి. ప్రజలకు గుర్రబ్బండితో పని లేకుండా అయిపోయింది. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. తాను, బుసీ ఫెలస్ ఎంత కష్టపడినా తిండికి జరగడం కష్టమయిపోతోంది.

ఈ దునియాలో ఎవరు మాత్రం శాశ్వతం? అందరూ ఈ ధర్తీలో కలిసిపోవాల్సిందే" మనసులో ఏదో తెలియని బాధ రొద పెట్టసాగింది.

"క్యాజీ... ఒంటరిగా కూర్చుని ఏదో ఆలోచిస్తా వుండావే... క్యా మామూ?" ఆతన్ని సమీపిస్తూ పలుకరించాడు కరీముల్లా.

"క్యాబీ నై బేటా! బైటో" అంటూ కాస్తా జరిగి అన్నాడు బాషా.

"లేదు జీ... నువ్వేదో బాధపడుతున్నావ్!" పక్కనే కూర్చుంటూ అన్నాడు కరీం.

"నా గుర్రం గురించే కదా నా బాధ. దానికి చిన్న కష్టమొచ్చినా సొంత బిడ్డకొచ్చినట్లు తల్లడిల్లిపోయేవాణ్ణి. యిప్పుడెలా వుందో?" నొప్పిగా అన్నాడు బాషా.

"అట్లాంటప్పుడు దాన్ని నీకొడుక్కెందుకిచ్చినావు?"

"వాడితో జగడం పడలేకనే. పైగా దాన్ని నాకంటే వాడే బాగా చూసుకుంటాడేమో అనుకున్నా. కానీ యిపుడు దానికి కాలిరిగిందనీ, ఏదో రోగం వచ్చిందనీ తెలిసే, నా మనసులో ఒకటే బాధ"

"ఏం రోగమంట మామాజీ?"

"నహీంఁ... మాలుం హువాఁ బేటా"

"పశువులకొచ్చే 'కుటుం' వుంటుందేమో' తన అల్ప జ్ఞానాన్ని ప్రదర్శించాడు కరీం.

"ఉండచ్చు" చెప్పాడు బాషా.

"కుటుమైతే క్యా కరే?"

"గొడ్లకు కుటుం వస్తే మబ్బేసుకుని మేత మేయకుండా చస్తాయి. అదే గుర్రమైతే బొడ్డు కింద వాపొస్తుంది. అప్పుడేం చేయాలంటే గాడిదరి కరింపాకు (గాడిద కడుపాకు), గుండునల్లేరు, తెల్లగడ్డలు, అల్లం, బెల్లం, నల్ల తమలపాకు, జిల్లేడు కొనలు వేసి దంచి ఉండలు చేసి తినిపించాలా"

"బహుతచ్చా మామాజీ... మరి మెడవాపు వస్తే?" ఉత్సాహంగా

ప్రశ్నించాడు.

"కిరసనాయిల్లో గడ్డ కర్పూరం ఊరబెట్టి, దాంతో మర్దనా చేస్తే సాలు. వాపు తగ్గి, చర్మం పట్లపట్లగా పగిలిపోయి బాగైపోతుంది"

"మామాజీ! గుర్రం పాలు మనుషులు తాగకూడదా. క్యా?"

"అచ్ఛా బేటా, తాగొచ్చు. కానీ ఆ పాలు తాగినోళ్ళకు పొగురు పెరుగుతుంది. అప్పుడు మొగోళ్ళకైతే వొగ బీబీ, ఆడోళ్ళకైతే వొగ ఆద్మీ చాలదు..." అంత బాధలోను ముసిముసిగా నవ్వుతూ చెప్పాడు బాషా.

"ఓయమ్మో, భలే పవరే. అది సరేజీ. సారాయి మానేదానికి గుర్రం మందు వుందంటారే... అదెట్లో బోలోజీ" అడిగాడు కరీం.

ఆ మాటతో బాషాకి కాస్త ఉత్సాహం వచ్చింది.

"మందుకొట్టే మనిషికి సారాయిలో గుర్రం చెమటగానీ, దాని ఉచ్చ లుగానీ కలిపి తాగిస్తే యింక వాడు జన్మలో సారాయి జోలికి పోడు"

"గంజరమంటే సంపాదిస్తారు గానీ గుర్రం చెమటనెట్ల సంపాదిస్తారు?"

"సీసా బిరడాల్తో గుర్రం జబ్బల్లో గోకితే చెమటొస్తుంది. దాన్ని వడగట్టి సెంట్లు, సబ్బుల తయారీలో వాడతారు. అంతేగాకుండా గాలీ ధూలీ రాకుండా గుర్రం ఎడమ కాలి నాడాం గడపల్లో కొట్టుకుంటారు. ఇంకా గుర్రంతోక బొచ్చుతో బ్రష్‌లు తయారుచేస్తారు" గుర్రం వల్ల కలిగే ప్రయోజనాలు ఏకరువు పెట్టాడు బాషా.

"వొగ ఎంటిక తీసి పులిపిరికి బిగిస్తా వస్తే... అది ఊడిపోతుందంటారు కదా"

"ఇంక ఏం చేసినా మామూ గుర్రాన్ని మరిచిపోలేడు" అనుకొని ఆతని బాధను మరపించే ప్రయత్నం మానుకొని "డర్ మత్ కర్నా మామాజీ. నీ గుర్రం బాగానే వుంటుంది" ధైర్యం చెప్పసాగాడు కరీం.



"ఆఁ... నిజమే! ఇంకా పిల్లోలకు బాలగ్రహాలు సోకకుండా వుండే దానికని మొల్తాడులో గుర్రం ఎంటికలు కూడా కడతారు"

"బహుతచ్ఛా మామాజీ" మెచ్చుకోలుగా అన్నాడు కరీం.

"క్యారే కరీం? నిన్ననంగా కురబలకోటకు పోయినాడు వలీ. యింకా రాలా. మేరా ఘోడా సంగతి తెలీడంలేదు. క్యాకరే?"

"డర్ నహీ మామూ. వస్తాడులే. మామాజీ... ఈ గుర్రాల్లో ఎన్ని రకాలుండాయంటావు?" మళ్ళీ గుర్రం బాధనుంచీ దృష్టి మరల్చడానికే ప్రశ్నించాడు కరీం. బాషా మనసంతా గుర్రంపైనే వుంది. అయినా కరీంకు జవాబు చెబుతూనే వున్నాడు.

"బోలోజీ..." మళ్ళీ అడిగాడు.

"నాలుగయిదు రకాలు నాకేం తెలుసు కరీం. గోధుమ రంగువి సమున్ జాతివి. వక్క కలర్‌వి ముష్కీ జాతివి. తెలుపు నలుపుగానీ, ఎరుపు తెలుపుగానీ మట్లుంటే అవి అబ్లెక్ జాతివి. ఎరుపు రంగువి సారంగం జాతివి. తెల్లంగా వుండేది సంజాబ్. ఇవిగాక నాటువి, రేసువి కూడా వుండాయి" అన్యమనస్కంగానే చెప్పాడు బాషా.

ఆతని అశ్వ విజ్ఞానానికి ఆశ్చర్యపోతూ "రేస్ గుర్రాలు మేపుకుంటే మేలుగదా మామాజీ?" అని అడిగాడు కరీం.

"వాటిని మేపేది కష్టం బేటా. అవి బాగా పరుగెత్తుతాయి. కానీ అవి చోటాఁ బచ్చేంమాదిరి. ఊరికే అట్ల వానలో తడిసినా జ్వరం వచ్చి చస్తాయి. మనం మేపలేం" చెప్పాడు బాషా.

"అచ్ఛాజీ! మరి ఈ నాటు గుర్రాలు స్పీడుగా దౌడు తీయవా క్యా?"

"పరుగెత్తుతాయి. అయితే దానికొక ట్రిక్కుంది. నాలుగు ఎండు కర్జూరాలు తినిపిస్తే పది మైళ్ళు పరిగెత్తేది. ఇరవై మైళ్ళు పరిగెత్తతాది. ఎంత పరిగెత్తినా వాటి ట్రయినింగు వీటికి వుండదు కదా"

కరీం ఎంత మరిపించాలని చూస్తున్నా బాషా ఆలోచనలు తన గుర్రాన్ని వదిలిరావడం లేదు.

"క్యా బేటా, ఈ వలీగాడు రాలేదే. మేరా ఘోడా బతికివుందో లేదో?" అనుమానం వ్యక్తం చేశాడు బాషా.

"ఇంక ఏం చేసినా మామూ గుర్రాన్ని మరిచిపోలేడు" అనుకొని ఆతని బాధను మరపించే ప్రయత్నం మానుకొని "డర్ మత్ కర్నా మామాజీ. నీ గుర్రం బాగానే వుంటుంది" ధైర్యం చెప్పసాగాడు కరీం.

అంతలో అక్కడికి రానే వచ్చాడు ఖాదర్‌వలీ.

"బడే పాపా! వచ్చేసినా" అంటూ వాళ్ళ దగ్గరికి నడిచాడు వలీ.

ఆతన్ని చూడగానే "క్యా బేటా, కైసా హైరేఁ మేరా ఘోడా?" ఆతృతగా అడిగాడు బాషా.

"ఘోడా అచ్ఛా నహీ బడే పాపా! కాలిరిగింది. కట్టు కట్టే దిక్కు లేదు. సరైన మేత లేదు. బొచ్చూడిపోయి దాని వళ్ళంతా గజ్జికుక్క చర్మం మాదిరైపోయింది. ఘోడా సూకీమచ్ఛీ జైసాహోగాజీ. మేత పెడితే కూడా తినడం లేదు. చూసేదానికే కష్టంగా వుండాది బడే పాపా" గుర్రం పరిస్థితిని తటపటాయిస్తూనే తెలియజేశాడు వలీ.

ఆ మాట వినగానే బాషా గుండె గుభేలుమంది.

"హమారా బేటా ఏమీ పట్టించుకోలేదా?" కోపంగా అడిగాడు.

"మీ సలీం పట్టించుకొని వుంటే, దానికి ఈ పరిస్థితి ఎందుకొస్తుంది? వాడికి దుడ్డు, యాపారమే దునియా అయిపోయింది. రోడ్డువార వొగ చెట్టుకింద దిక్కూ మొక్కూ లేకుండా గుర్రాన్ని పడేసేసినారు. రోడ్డింటి వచ్చేపోయేవాళ్ళు దాని గోస చూడలేక సలీం భయ్యాని తిట్టి పోస్తున్నారు. అది అనాథ మాదిరి పడుండాది. అంతా ఈ రోజో రేపో అన్నట్టుండాది బడే పాపా" వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ చెప్పాడు వలీ.

అంతా అర్థం అయిపోయింది బాషాకి.

"సలీం బేటా కైసా హైరే? బచ్చేం ఎలా వున్నారు?" సలీం బాషా క్షేమ సమాచారాలడిగాడు కరీముల్లా.

"భయ్యాకేం మామాజీ! రెండు చేతులా సంపాదిస్తా వుండాడు. అంగళ్ళులో కసాయి అంగిడి కొడుకు చూసుకుంటా వుండాడు. భయ్యా చింతపండు యాపారంలో దిగినాడు... మొస్తుగా సంపాదించి నాడులే" సలీం ఆర్థిక స్థితిని గురించి చెప్పసాగాడు వలీ.

కానీ అవేవీ బాషా మెదడులోకెక్కడం లేదు.

"వంట్లో శక్తి వున్నంత కాలం నన్ను ఉపయోగించుకున్నాడు. బుసీఫెలస్‌కి కాళ్ళాడున్నంత కాలం దాన్నుపయోగించుకున్నాడు. యిప్పుడు ప్రయోజనం లేదని నన్నొదిలేసినట్లే గుర్రాన్నీ వదిలేసినాడు. అబ్బా, అమ్మీ అంతా యాపార సంబంధమైపోయింది. మనుషులు ఆదాయం చూసుకుంటావుండారుగానీ అనుబంధాలు చూసుకోవడంలే" మౌనంగా మనసులోనే అనుకున్నాడు.

ఆతనికి బుసీఫెలస్ దుస్థితిని తలచుకునేకొద్దీ దుఃఖం గుండెల్ని తనుకొని రాసాగింది. ఆతని కళ్ళనుంచీ కన్నీరు ధారాపాతంగా స్రవించి ఆతని వడిలో పడసాగాయి. మొహరంనాడు తొక్కే అలావా అయిపోయింది ఆతని మనసు.

"తో క్యా కరే?" పదే పదే అనుకోసాగాడు.

కళ్ళ ముందర ఏదో మెరుపు మెరిసినట్టయింది. చిన్ననాటి నుంచీ గుర్తుకు వచ్చే దృశ్యం మనసులో మళ్ళీ బొమ్మ కట్టింది.

"అలెగ్జాండర్ కొలువుతీరిన బుసీఫెలస్... దాన్ని చూసి పారిపోతున్న జనం... దాని పేరు వినగానే పాలు తాగడం ఆపేసి ఏడ్చే పసిపిల్లలు"

అయితే ఈసారి దృశ్యం మసక మసకగా, పురాతన కాలంనాటి మసిబారిన చిత్రపటంలా అనిపించింది. అది క్షణకాలం మాత్రమే కనిపించి క్రమంగా కనుమరుగయిపోయింది.

"నహీఁ! నా గుర్రాన్ని నేనే రక్షించుకుంటాను. మై జాకే మేరే ఘోడేకో బచాలూంగా... మై బచాలూంగా. మై ఆరహాహూఁ బుసీఫెలస్! మై ఆరహాహూఁ, ఓ మేరా ప్యారీ బుసీఫెలస్... తుమ్ యతీమ్ నహీ హై... తుమ్‌కో మై హూఁ... బుసీఫెలస్! నువ్వు అనాథవు కావు!"

ఆవేశంతో, దుఃఖం నిండిన కంఠంతో, వణుకుతున్న శరీరంతో అరుస్తూ పైకి లేచాడు మహబూబ్ బాషా.

•